# పతంజలి పంతం

(కథానిక)

పతంజలిశాస్త్రి షికారునించి యింటికి వచ్చాడు. రాగానే ఇంట్లో అంతా గుడగుడగా వున్నట్టు కనిపెట్టాడు. తల్లి సోదెమ్మ ముఖంలోనూ, వదినెగారు జానకి ముఖంలోనూ చిరునవ్వులు వెలుగుతున్నాయి.

అసలు ఈ చిరునవ్వులు ఏదో జరిగిన, లేక జరగబోయే పెద్ద విషయాన్నొకదాన్ని సూచిస్తవి. ఇంక, ఈ చిరునవ్వులు అతని మీదనే ఉండబట్టి అతను ఈ జరగబోయే, లేక జరిగిన పెద్ద విషయంలో తన పాత్ర ఇంతో అంతో వుందని పసి కట్టేశాడు.

పసి కట్టిన వెంటనే ఏమీ అనలేదు గనక పెరట్లోకి కాళ్లు కడుక్కోందికి వెళ్లాడు.

తిరిగి వచ్చేసరికి అన్న జగన్నాథం సావిట్లో కొస్తున్నాడు. అతని చేతులో ఏదో కాగితం ఉంది.

"చినమామ ఉత్తరం రాశాడురా; నిన్ను రమ్మని... ఇదుగో చూసుకో." అని ఆ కాగితాన్ని పతంజలి శాస్త్రికిచ్చాడు.

ఇంకేముంది? అక్షణంలోనే పతజంలిశాస్త్రి ముఖం ఎర్రబడి పోయింది. ఎందుచేత? చిన మామ ఎవరో. ఉత్తరం రాయడం దేనికో, అంతా అతనికి తెలుసు!

"ఎందుకు? చెప్పవలసినదంతా నువ్వే చెప్పేశావుగా!" అంటూనే ఉత్తరం అందుకున్నాడు పతంజలిశాస్త్రి.

అందుకోవడమే తడవుగా, ఆత్రంగా దాన్ని శ్రీకారం మొదలు చిత్తగించవలెను వరకూ పర్యవేక్షించేశాడు. అందులో అతనికి తెలిసిందే వుంది!

ఆ విధమైన ప్రథమ నిర్లక్ష్య పర్యవేక్షణ కాగానే ఆ కాగితాన్ని అన్నకిచ్చేశాడు.

జగన్నాథం నెమ్మదిగా "వాళ్లని నువ్వూ నిన్ను వాళ్లూ చూసి చాలా కాలమై పోయింది. నీ పరీక్షలు కూడా అయిపోయాయి గనక ఓమాటు వెళ్లిరా. రేపు బుధవారంనాడు దశమి-మంచిది." అన్నాడు.

పతంజలిశాస్త్రి నిబ్బరంగా "వెళ్దాములే. తొందరెందుకు?" అన్నాడు కిందికి చూస్తూ.

"తొందరెక్కడరా? ఆగవలసినన్నాళ్లూ ఆగారు."

"పోనీ ఈ చదువైనా కడతేరితే—"

"అది నాకూ తెలుసులే. కాని రిజల్ట్సు తెలిసేవరకూ నువ్విక్కడుండి కూడా ఏం చెయ్యవుగా!" అని కొంచెం ఆగి "అసలింతకీ అన్నీ ఈ క్షణంలో అయిపోయినట్టు మాట్లాడతావేం? వెళ్లి ఓమాటు చూసొస్తావు; అంతే!" అన్నాడు.

"వాళ్ల సంబంధం చేసుకుంటే చేసుకుంటావు లేకపోతే మానేస్తావు. వెళ్లి చూసిరావడానికేమయ్యా?" అన్నది జానకి అప్పుడే వొచ్చి.

"అదిగదీ!" అన్నాడు జగన్నాథం.

"సరే చూదాం." అని పతంజలిశాస్త్రి అక్కణ్ణించి వెళ్లాడు.

ఆ వెళ్లడం తిన్నగా తన గదిలోకి వెళ్లాడు. ఇవాళ తన జీవితంలో ఎంత ముఖ్యమైన రోజన్నమాట!—చిన్నతనంలో ఏడాదికోసారి వాళ్లింటికి వీళ్లు, లేక వీళ్లింటికి వాళ్లు, వస్తూ పోతూ ఉండడంవల్ల పరస్పరావలోకనాలేమిటి, పిల్లలిద్దర్నీ పెద్దలు ఏడిపించడమేమిటి, మహా సరదాగా అయ్యాయి. వాటి ప్రకారం పార్వతీ అతనూ భార్యాభర్తలు కావలసి ఉంది. ఒకర్నొకరు చూచుకోడానికి, ఇష్టాయిష్టాలు—బహుశా యిష్టాలే—తెలుపుకోడానికీ సమావేశం అవసరం. ఇలా రమ్మని ఇది వరకు ఎవరూ వ్రాయలేదు. అందుకని ఈ రోజు ఎంతో ముఖ్యమైంది.

అయితే పతంజలి శాస్త్రి ఈ దినం శుభదినమని తెలియగానే పొంగాడే గాని అతను,

భమిడిపాటి రామగోపాలం

వెళ్ళరా బాబూ అనగానే వెళ్ళిపోయే రకం గాదు! అయిదు రోజులు సమయముంది. ఈ లోగా అతను ఎంత గ్రంథమైనా నడపగలడు!

బెట్టు చెయ్యడమనేది కేవలం నియమం విలువని బట్టి మాత్రమే నిశ్చయించుకో బడ లేదు! అవసరం ఉంది; అది సిగ్గే అవకాశం ఉంది! వేలువిడిచిన మేనమామ తనని రమ్మని స్వయంగా ఉత్తరం రాశాడు. తల్లి, అన్న, వదినె, అందరూ సంతోషిస్తున్నారు. అంటే తన దగ్గిర వీళ్ళందరికీ ఏదో అవసరం ఉంది. అంటే తనకి బెట్టుచేసే అవకాశం అన్నమాట! ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి!

నిజానికి పతంజలి శాస్త్రి ఏమంత బేరసికుడు కాడు. బెట్టు చెయ్యాలని నిర్ణయించుకున్నంత మాత్రంలో అతని ఆలోచనలు అక్కడే ఉన్నాయని అనుకోడానికి వల్లగాదు! అవి ఇల్లు దాటి వీధి దాటి, ఊరుదాటి, నూరుమైళ్ళ దూరం పోయి అప్పుడే చినమామగారి యిల్లు చేరుకున్నాయ్. అంతర్యంలో అతనికి చినమామగారింటికి వెళ్ళాలనీ, పార్వతిని యౌవనపు బిగువుల్లో చూడాలనీ ఎంతో గట్టి కోరిక వుంది. అసలు ఏమీ స్థిరమైన అభిప్రాయాలు లేని చిన్నతనంలోనే పార్వతిమీద పతంజలి శాస్త్రి పెళ్లికి ప్రథమ ఘట్టమైన దీనిని కాదనగలడా?– ఈ అయిదు రోజులూ త్వరగా గడిచిపోతే బాగుండు ననిపిస్తోంది అసలు!

కాని ఒక సంగతి అతనికి ఖచ్చితంగా జ్ఞాపకం ఉంది! అదే!—పీకమొయ్యా బతిమాలించుకుంటేగాని వెళ్ళకూడదు!

* * *

ఇలా అని అతను గట్టిగా నిశ్చయించుకున్నాడు; ఇంతలోనే జానకి ఆ గదిలోకొచ్చింది. రాంగానే వది నెరికం వలకబోస్తూ "ఏమయ్యా వెళ్ళికొడకా!" అన్నది.

పతంజలిశాస్త్రి కుర్చీ చేతులు గట్టిగా పట్టుకుని నంగిగా "ఊఁ" అని మాత్రం అన్నాడు.

"మడిగట్టుకో— వొడ్డిస్తున్నారు."

"ఒస్తున్నాను పదండి."

ఈ సమయంలో ఒక విషయం చెప్పవలసి ఉంది. పతంజలిశాస్త్రి ఒక పని చేసేముందు కొద్దిగానో గొప్పగనో బెట్టు చేసాడని మీకు తెలుసు. కాని దీనికో పిల్లవుంది. ఒక పెద్ద బెట్టు గాని అతను చేయబోయినట్టయితే, దానికి ముందు చిన్న చిన్న బెట్టులు అనేకం ఉంటాయి. ఈ సంగతి జానకి గుర్తించింది గాబట్టి ఏం సాయనా, ఫలానా పని చేస్తావా చెయ్యవా అని వెటకారంగా అడిగి అతని ఒళ్లు మండించుతుంది. ఈ వలలో పతంజలిశాస్త్రి అనేకసార్లు పడాడు.

"సర్లే కాని పతంజయ్యలూ! మామగారింటికెప్పుడు ప్రయాణం?"

పతంజలిశాస్త్రి నిర్లక్ష్యంగా "చూద్దాం లెద్దురూ!" అన్నాడు.

జానకి విచారించినట్టు చప్పుడుచేస్తూ "సిగ్గు కావున్ను పాపం!— పోన్లేగాని ఈ పూట భోంచేస్తావా చెయ్యవా?" అని పక్కకి తిరిగి నవ్వుకుంది.

పతంజలిశాస్త్రికి ఉడుకుమోతుతనం వొచ్చేసింది, "ఇలాంటి చిల్లర విషయాలకిగాను భోజనం మానుకునే దద్దమ్మని కానులెండి. అక్కడికి వెళ్ళనంతే!" అన్నాడు నిక్కచ్చిగా.

జానకి నవ్వుకుని "అమ్మయ్యో!" అని దీర్ఘం తీసి వెళ్ళిపోయింది.

పతంజలిశాస్త్రి తన వేలు విడిచిన మేనమామగారి యింటికి వెళ్ళననెయ్యడంతోనే గ్రంథం అఖరయి పోవడానికి వీల్లేదు. కాకుల్లాంటి యీ లోకులున్నారే, వీళ్ళూరుకోరు.

పాపం వాళ్ళ చినమామ కష్టపడి ఉత్తరం కూడా రాశాడాయె; అలాంటప్పుడు ఓమాటు వెళ్ళి రావడం పెద్దమనిషి తరహా కదా!

వాళ్ళ సమ్మంధం చేసుకుంటే చేసుకోవచ్చు లేకపోతే మానెయ్యవచ్చు. అది వేరేసంగతి. కాని బంధువు; ఉత్తరం రాశాడు రమ్మని. తెల్లారితే చుట్టపు చూపులుంటాయి. అందులో అలాంటిలాంటి బంధువా, పోనీ తాట్ నేను రానని కొట్టి పారేసేందుకు? సోదెమ్మగారికి సయామూ పెత్తండ్రి కొడుకాయె!

ఇంతకీ వెళ్ళక ఆయనగారిక్కడ చేసే ఉద్యోగమేమిటి? పరీక్షలైపోయినయి. తినడం తిరగడమేగా!

—అంటారు లోకులు!

ఇంత పెద్ద వకాల్తానామాని, ఒక్క రక్షణతో ఎలా ఆపడమా అని పతంజలి శాస్త్రి బెంగ. అవును మరి-తన స్వవిషయం యిది; అక్కడికి వెళ్ళడానికీ మానడానికీ సంపూర్ణ స్వాతంత్ర్యం తనకుంది. ఈ ఒక్క రక్షణా చాలునా అని.

మొట్టమొదటి పరీక్ష భోజనం దగ్గరే, చాల తక్కువ వ్యవధితోనే అయింది.

అదీ చాలా బాగా అయింది. ముందుగా అన్న, వదినె, తల్లి సమష్టిగా ఒకచర్చకి దిగారు. అది పెళ్లినాటి భోగట్టాలన్నిటి మీదాను.కట్నం యెంత అడగాలి? లాంఛనాలేమిటి ఇత్యాదులు.

ఈ చర్చ అవుతున్నప్పుడు పతంజలి శాస్త్రి "అలూ లేదు చూలూ లేదు, కొడుకు పేరు సోమ లింగం" అని అందామనుకున్నాడు. కాని అన కుండా ఉండగలిగినందుకు తనను తాను అభినం దించుకున్నాడు. ఎందుకంటే భోజనాంతం వరకూ అలా ఉండగలిగితే అదో కీర్తి.

పోనీ పతంజలి శాస్త్రి అలా మాటాడనని మనస్సులో నిశ్చయం చేసుకున్నాడని గ్రహిం చయినా వాళ్ళూరుకోవాలా? అలా జరగలేదు. వాళ్ళేం చేశారూ అంటే అలా చర్చించి చర్చించి, జరగబోతున్న విషయానికి వొచ్చారు.

పతంజలి శాస్త్రి అనే యీ కుర్రాడు రేపు దశమీ బుధవారంనాడు తన వేలువిడిచిన మేన మామ గారింటికి వెళ్తాడు. ఎన్ని రోజులుంటా డూ అని!

ఏవో కొన్ని రోజులుంటాడు, ఎన్ని రోజు లుంటే ఏంపోయిందని అయినా వాళ్ళూరుకో లేదు. అక్కడ అతను యెన్ని రోజులుండాలీ అనే విషయం పతంజలి శాస్త్రి ఇష్టం మీద ఆధారపడి ఉంటుందని ఏకగ్రీవంగా నిర్ణయిం చారు.

ఇటువంటి సమయంలో నీతిశాస్త్ర ప్రకా రమే అయితేనేమి, సంభాషణ క్రమంలోని సాంకేతిక నిబంధనల ప్రకారమే అయితేనేమి, పతంజలి శాస్త్రి మాటాడవలసి ఉంది. కాని అతను మాట్లాడలేదు.

ఇది క్షమించరాని అపరాధమే అయినా క్షమించి సూటిగా ప్రశ్న వేశారు.

ఇంకా పతంజలి శాస్త్రి మాటాడలేదు.

"అలా మొండికెత్తి కూచుంటే ఎలా గరా?" అన్నాడు జగన్నాథం.

కాని అలా మొండికెత్తి కూచుంటే ఎలాగ అన్నది వ్యాపార రహస్యం లాంటిది. అంచేత పతంజలి శాస్త్రి మాటాడలేదు.

"బాగుంది వరస!" అని సోదెమ్మ చారు గిన్నెకోసం వంటింట్లోకి వెళ్లింది.

జానకి ముసిముసి నవ్వుతో "అబ్బాయిగా రిలా సిగ్గుపడుతూ కూచుంటే ముహూర్తం కాస్తా మించిపోయి ఆ పిల్లనెవరో మాట్లా డుకు పోతారు గాబోలు" అన్నది.

దీంతో పతంజలి శాస్త్రి కి వ్రతభంగం అయింది. అతనికి సొంతంగా మాటాడాల కోరిక పుట్టింది. ఇతరుల్తో మాట్లాడ్డమయితే గొంతులోకి ఒక గంభీరత వస్తుంది. వదినె గారితో అయితే సరదాగా మాటాడవచ్చు.

చెయ్యి విస్తట్లో పడేసి, తాత్కాలికంగా జానకి వేపుచూసి, మళ్లీ విస్తరివేపు చూస్తూ "సిగ్గెందుకు వదినా!—అయినా నాకు తొం దర్లేవంత సేపూ ఎవరే వస్తువుని తన్నుకు పోయినా నేనటు చూడను. ఇంక నాకవసర మైనప్పుడా, నన్ను వెతుక్కుంటూ ఎలాగా వొస్తాయిగా అవి!" అన్నాడు.

దేశంలో ఆడవాళ్లెక్కువని పతంజలిశాస్త్రి ఎరుగును.

ఇంతలో సోదెమ్మ చారుగిన్నెతో వచ్చింది.

"ఏమి టేమిటీ? అని సాగతీసింది.

పతంజలిశాస్త్రి మాటాడలేదు.

"వాడికిప్పట్నించీ తొందరేమీ లేదని తేల్చాడు." అన్నాడు జగన్నాథం.

"అమ్మక్కే చెబుదువుగాని, చినమామ గారింటికి వెళ్లు. మధ్యన్నెందుకీ నిష్ఠూర్యాలు మీద వేసుకోడం?—అయినా ఒకే పెద్ద వాడా, బతిమాలుతున్న కొద్దీ తాడెక్కు తాడేంరా? నిక్షేపంలా వాడు సమ్మంధం చూసు కోడానికి రమ్మని ఉత్తరం రాస్తే, వెళ్లక వీడిక్కడ చేసే వుద్యోగమేమిటి చెప్పారేఁ?" అన్నది సోదెమ్మ దబాయించి.

"అది కాదత్తగారూ! వెళ్లమనగానే వెళ్లి పోతే పెళ్లాంమీద మమకారం అంటారని, బెట్టు చేస్తున్నారు!" అన్నది జానకి. ఎవరూ

ఏమీ మాట్లాడకపోగా పతంజలిశాస్త్రి వేపు తిరిగి "పాపం బెట్టు చేస్తున్నకొద్దీ బతిమాలడానికి అత్తగారికి ఓపిక తగ్గిపోయింది; బహుశాయిక అడగరేమో! ఈ మారైనా ఊఁ అనవయ్యా!" అన్నది.

చాలసేపు నిశ్శబ్దంగా గడిచింది. భోజనాలు పూర్తికావచ్చాయి. అప్పుడు పతంజలిశాస్త్రి, ఖాళీఅయిన తన విస్తరితో అన్నాడు. "నాకు వెళ్లడం ఇష్టంలేనప్పుడు బతిమాలినా వెళ్లను బలవంతంచేసినా వెళ్లను. దీనికోసం అందరూ ఇంతంత శ్రమలు తీసుకోవవద్దని నామనవి.

ఇలా అని అతను ఉత్తరాపోశనపట్టి లేవబోతున్నాడు.

"బలవంతం చేసేదీ మానేదీ పెద్దవాళ్లు ఆలోచించే చేస్తుంటారు.మనం బాగుపడడానికే చేస్తారు; చెడిపోడానిక్కాదు!" అన్నాడు జగన్నాథం శాంతంగా, నెమ్మదిగా.

పతంజలి శాస్త్రి ఇందులోని శాంతమూ, నెమ్మదీ, అంతంతే ఉన్న పట్టుదలా కాఠిన్యం గమనిస్తూనే వెళ్ళిపోయాడు.

"అవునుగానోరే, వీణ్ణేమయినా, రాళ్లెత్తమన్నారా గుళ్లెత్తమన్నారా? అంతలా మాట్లాడతాడు?" అన్నది సోదెమ్మ.

"ఊరుకో అమ్మా! వాడు వెళ్ళడనుకున్నావేమిటి? వెళ్తాడు. ఉట్టినే విలవ పోతుందేమో అని బెట్టు చేస్తున్నాడు గాని లేకపోతే వాడికి మాత్రం లేదా యేమిటి?" అన్నాడు జగన్నాథం నవ్వుతూ.

* * *

మర్నాడు ఉదయం సోదెమ్మ కాఫీ పట్టుకుని పతంజలిశాస్త్రి గదికి వెళ్లింది. రాత్రి జగన్నాథం చెప్పిన మాటలు నమ్మబట్టి విసుగూ ఏంలేకుండా ప్రసన్నంగానే ఉంది.

తలుపు తెరుస్తూ లోపలికెళ్లి "ఏమిరా చిన్నప్పా కాఫీకి రాలేదూ?" అన్నది. పతంజలిశాస్త్రి మాట్లాడలేదు. "అవునుగాని ఇదేమిటి తలుపేసుకు కూచున్నావ్?" అన్నది.

పతంజలిశాస్త్రి కేవలం కాఫీ అందుకుని నోటిదగ్గర పెట్టుకున్నాడు.

"వెళ్తావు గదూ!" అన్నదావిడ లాలింపుగా.

"చూదాంలే."

"రేపు బుధవారంనాడు పంపమని రాశాడు; ఇంకా టైముందిలే!"

"ఐతే?"

"—చూడుమీ పిల్లని చూసిందిక్కాదా, వెళతావు! నీ కెలావున్నదీ మాత్రం చెప్పకూడదు! ఒకవేళ వాళ్ళడుగుతారు పిల్లనచ్చిందా లేదా, చేసుకుంటావా-ఇలా అని. నువ్వేమీ అనకు-తెలిసిందా?" అంటున్నది ఆవిడ.

"బాగుంది వరస. ఏదో సామిత చెప్పినట్టు! ఆలూ లేదు చూలూలేదు కొడుకు పేరు సోమలింగమంట! నేను వెళ్ళను మొర్రో అంటూ వుంటే ఇదేమిటే గొడవ?" అన్నాడు పతంజలి శాస్త్రి.

సోదెమ్మ తెల్లబోయింది. "ఇదేమిట్రా ఈ రోగం?"

"అవును. రోగం కాదూ మరి? సంవత్సరాని కోమాటు ఉత్తరం రాస్తాడో రాయడో మహనీయుడు. వొచ్చీవలిసింది అని ఆజ్ఞాపిస్తూ ఉత్తరం ముక్క రాశాడెలాగయితేనే! ఇవతలి వాళ్ళు జోహార్ చేస్తూ వెళ్ళిపోవాలి! అంత మీదమీద కూచున్నారేమిటో!" అన్నాడు పతంజలి శాస్త్రి కోపంగా.

"అయితే నామీదఎగురుతావేం ఖర్మంరా?"

"కాకపోతే ఏం చెయ్యాలి? నిన్న సాయింత్రం నించీ ఒకటే కొట్టుకుపోతున్నారు! ఏదో పెన్నిధి వొచ్చినట్టు!"

"బాగానే వుందిరా. అయితే నిజంగా వెళ్ళవా యేమిటి?"

"ఎవడు వెళ్తాడు?"

ఉత్తినే యెందుకింత ఖచ్చితంగా మాట్లాడేశాడు పతంజలి శాస్త్రి? ఈ సందేహం మనతోబాటు అతనికీ పుట్టింది. కొంచెం భయంకూడా మొదట్లో పుట్టడం నిజమే. కాని ఫరవాలేదని సమర్థించుకున్నాడు.

ఎలాగ?

మంగళవారంనాటి సాయంకాలం వరకూ తను వెళ్ళనంటున్నా సరే, ఇంట్లోవాళ్లు బ్రతిమాలుతూ ఉండడం జరుగుతుంది!-తను మరిపిస్తున్నకొద్దీ వాళ్లు బతిమాలుతూ ఉండడం వాళ్లు బతిమాలుతున్నకొద్దీ తను తాడెక్క—

పోతూ ఉండడమూ చిన్నతనంనించీ పరిపాటి!

అయితే పతంజలి శాస్త్రి ఇంట్లో యెవరితోనూ మాట్లాడడం మానివేశాడు. ఉత్తప్పుడే కొంచెం తప్పుకుని తిరిగే మనిషి. అందులో ఈ మధ్య కోరుండి ముభావంగా ఉంటున్నాడు. అది తన దిట్టమైన కోటను మరింత బలవంతం చేస్తుందని అతను గట్టిగా నమ్మాడు.

సోమవారంనాటి మధ్యాహ్నంజానకి అతన్ని భోజనానికి పిలవడానికి వచ్చేసరికి అతను దొంగతనంగా ఓ పుస్తకం విప్పి దానివేపు చూస్తున్నాడు.

జానకి కొద్దిగా నవ్వి "ఏమయ్యా పెళ్ళికొడుకా! పలుకే బంగారమైపోయిందే యీ మధ్య? పుస్తకం విప్పావ్, సమయానికి?" అన్నది.

పతంజలి శాస్త్రి ముఖాన్ని ఇంకా గంభీరంగా చేసుకొని "ఏం? ఏం మ్మాట్లాడాలి? యెవరితో మాట్లాడాలి? మాటాడితే యేం ప్రయోజనం?" అన్నాడు గబగబా.

"చ్చ్ చ్చ్ చ్చ్-అవునుమరి! చదువులు చదివారు; పెద్దవాళ్ళయినారు; ప్రయోజనం లేనిదీ ఒకమాటయినా మాటాడ్రదు!... ఏ ధరలో వుందండీ తమ మాట?" అని జానకి విప్పారిన నవ్వుతో అన్నది.

"మీరట్టే హాస్యమాడితే చెప్పలేనుగాని ఏముం దసలు మాట్లాడడానికి?"

"...మీ అన్నయ్యగారితో అసలు మాట్లాడేదే తక్కువే. మరి ఈమధ్య నాలుగు రోజుల్నించీ అత్తగారితో కూడా యేమీ మాటాడ్డం లేదు. ఎటొచ్చీ అన్నందగ్గిరా కాఫీ దగ్గిరా నాతో కాస్త మాట్లాడుతున్నావ్. అదైనా యెందుకీ బలవంతపు బ్రాహ్మణత్వం అన్నట్టే మాట్టాడుతున్నావ్. ఇదేనా బాబూ వరసకి ఇలాగేనా. ఉండవలసిన రీతి?"

"నోటికొచ్చినట్టు పటపట వాగేస్తూండడం నాకసయ్యం!" అన్నాడు పతంజలి శాస్త్రి ఆ అసహ్యమంతా నోట్లో ధ్వనించేటట్టుగా.

"అయినా పెళ్ళిచూపులకి రమ్మని ఉత్తరం వొచ్చిన దగ్గర్నుంచీ మేం అసలే దీనిగా అవుపిస్తున్నాం!" అన్నది జానకి నవ్వి.

"పోన్లెండి. మీరిప్పుడు దేనికొచ్చారో నాకు తెలుసు. అన్నయ్యా అమ్మా మిమ్మల్ని రాయబారానికి పంపించారు."

అతని వెకిలితనానికి జానకి అతని ఎదురుగానే నవ్వి "కాదులే. భోజనానికి రమ్మని చెప్దామని వొచ్చాను" అన్నది.

పతంజలిశాస్త్రి ఉడికి, "పోన్లెండి; ఇప్పుడు గాకపోతే మరో అప్పుడైనా వాళ్ళు మిమ్మల్ని పంపకమానరు. అప్పుడే చెప్పండి, నేను చిన మామగారి యింటికి వెళ్ళదల్చుకోలేదు!" అన్నాడు బహు నిక్కచ్చిగా.

* * *

అతను చాలా అందరితోనూ నిక్కచ్చిగా వెళ్ళను వెళ్ళనని చెప్పేస్తూ వాళ్ళు లేనంత సేపూ పార్వతిమీదనే ధ్యాస పెట్టుకు కూచుంటున్నాడు.

కూచున్నంత మాత్రంలో తప్పు లేకపోవచ్చు. కాని అతనలా ఉత్సాహంగా కూచున్న ఆ సమయంలో ఎవరైనా చూస్తే "వీడు చాలా ఉత్సాహంగా వున్నాడే; పెళ్ళిచూపులకి వెళ్లేట్టే ఉంది; అనగా వీడు చేస్తున్నది బెట్టన్నమాట" అని గ్రహించెయ్యరూ?

ఈ సంగతులేవీ తెలుసుకోకుండా అతను పార్వతి గురించి ఆలోచిస్తూ కూచున్నాడు.

తనిప్పుడు అక్కడికి వెళ్ళేది అయిదేళ్ళ తరవాత. అయినా తనకీ పార్వతికీ పూర్వ్య పరిచయం ఉంది. ఈ పరిచయాన్ని పురస్కరించుకొని పార్వతితో కాస్త చనువుగా అదీ ఇదీ మాట్లాడాలా అక్కర్లేదా? మాట్లాడాలి. మాట్లాడితే ఎంత కలుపుకోలు మనిషి అనుకుంటారు.

లేదు లేదు అలా అనుకోరు—ఆడామగా విచక్షణ లేకండా యిలా చొరవ చేసుకు మాట్లాడిస్తున్నాడే, ప్రతీవాళ్ళతోనూ యింతేనని అనుమానపడతారేమో!

తను చొరవచేసుకుని మాట్లాడడు. సరే బాగానేవుంది. అయితే, ఒకవేళ పార్వతే కోరి మాట్లాడితే? అప్పుడు మాట్లాడకపోతే బాగుండదు. ముంగి ముచ్చులా పలకరిస్తే మాటాడ్డు; ఇంత సిగ్గేమిటీ? అనుకుంటారు.

అసలింతకీ తనతో పార్వతి మాట్లాడుతుందా అని!—అదేమిటీ? మాట్లాడకపోవడ

మేమిటీ? చాల్చాలు! తనేం పరాయివాడా? సయామూ వేలు విడిచిన మేనత్త కొడుకాయె. అదలా వుంచగా కాబోయె మొగుడాయె! అదలా వుంచగా పార్వతి ఇంగ్లీషు చదువుకుంది. ఎంత సోషల్ గా వుంటుందో!

ఆలాగని నిర్ణయం లేదు. కొందరు చదువుకున్నమ్మాయిలు దగ్గర బంధువులు పలకరించినా, ఏదో ఆధిక్యత చూసుకున్నట్టు మాటాడరు! మరి పార్వతి ఈ తరగతిలో చేరవచ్చునేమో!

ఏమిటి ఇంత తెలివితక్కువవాడు మన పతంజలిశాస్త్రి? అన్నానికి రావయ్యా అని విస్తట్లో వొడ్డిస్తే ఇదేమిటీ వ్యర్థపు ఆలోచనలు? కడుపునిండనా కాలునిండనా?

* * *

పతంజలిశాస్త్రి భోజనానికి కూచున్నాడు. పీట ఎదురుగుండా వున్నది విస్తరాకు. కాదు పరీక్షపేపరొకటి కూడా వున్నది. భోజనమూ నోటితోనే చెయ్యాలి; ఈ పరీక్షకి జవాబులూ నోటితోనే యివ్వాలి. కష్టమనితోచి కాబోలు, మొహం అదోలా పెట్టాడు పతంజలిశాస్త్రి.

జగన్నాథం అడిగాడు: "ఏమిరా? నువ్వొక్కడివే వెళ్తావా, నన్ను కూడా రమ్మన్నావా, లేక అమ్మని తీసికెళతావా? నువ్వొక్కడివే వెళ్లేకన్న మరొకళ్లు పక్కనుంటే బాగుంటుందని!" అధికారం ధ్వనిస్తున్నా నెమ్మదిగానే వొచ్చాయి మాటలు.

పతంజలి శాస్త్రి మాటాడలేదు.

"ఒరేయి చిన్నా. ఇంక మరి నాదగ్గర యీ శషభిషలు పనికిరావు. హఠాత్ హాత్ నే వెళ్లనంటూ కూచున్నావు. కడకి దాని చేత రాయబారం కూడా పంపించావ్. నువ్వెందుకు వెళ్ళవూ అని అడుగుతున్నాను?" అన్నది సోదెమ్మ నిలదీసి.

"నే వెళ్నంతే!"

"పిల్ల నచ్చలేదేమిట్రా? పోనీ మాతో చెప్పరాదూ ఇలావున్నాయి సాధకబాధకాలని? మేం పరాయివాళ్ళముట్రా?" అన్నాడు జగన్నాథం.

"నచ్చకపోవడ మేమిట్రా వాడి మొహం! రంభలా వుంటుంది. అది నచ్చకపోతే యింకెవర్తి నచ్చుతుంది వీడికి?" అన్నది సోదెమ్మ ఖచ్చితంగా.

"పోనీ వూరుకో అమ్మా. వాడి కిష్టంలేని పెళ్ళి చేయడం దేనికీ?" అన్నాడు జగన్నాథం.

"నువ్వూరుకో వోరే, ఇష్టం ఎందుకుండదో నే చూస్తాను—ఒరే చిన్నా హరిమీద గిరిపడ్డా గిరిమీద హరిపడా నువ్వెళ్ళవలసిందే" అన్నది సోదెమ్మ.

"నేనూ చెప్తాను హరిమీద గిరిపడ్డా గిరిమీద హరిపడ్డా పిల్లవాడిమీద పిడుగుపడ్డా నేను వెళ్ళను!" అన్నాడు పతంజలిశాస్త్రి.

ఇలా తను ఇంట్లోవాళ్ళని ఏడిపిస్తున్నానని తృప్తిపడుతున్నాడే గాని అతనికి తెరవెనక భాగోతం ఏమీ తెలీదు. తను, వాళ్ళనిక్కచ్చి మాటల్ని సరదాగా ఎలా తీసుకుంటున్నాడో వాళ్ళూ తన నిక్కచ్చి మాటల్ని అలాగే సరదాగా తీసుకుంటున్నారని అభిప్రాయపడుతూ మోసపోతున్నాడు.

ప్రత్యేకంగా అందరితోనూ వెళ్ళనంటే వెళ్ళనని కరాఖండీగా చెప్పేశాడు. వదినెతో యెంత కచ్చితంగా చెప్పాడంటే, "ఇదంతా బెట్టే" అనుకుంటున్న భర్తతోనూ అత్తగారితోనూ ఆమె మాటల్ని అంత గట్టిగానూ చెప్పి, నల్లమేకని బలియిచ్చినా అతను ఎక్కడికీ వెళ్లడని నమ్మించింది!

మంగళవారం నాటి సాయంకాలం జగన్నాథం తల్లితో "ఇవాళ పోస్టులో పంపించానే, చినమామకి ఉత్తరం! వాడు రాదల్చుకోలేదు,— మీ సంబంధం యిష్టంలేదని సూచిస్తున్నాడు; ఎంతైనా వాడిమాట కాదనలేం కదా, అని!— ఏమిటో బెట్టు చేస్తున్నాడనుకున్నాను గాని నిజంగా యిలాంటి అయిష్టం ఉంటుం దనుకోలేదు!" అన్నాడు కష్టంగా.

పతంజలి శాస్త్రి ఆ మాటలు విన్నాడు. కాని ఏమైనా మాట్లాడకలిగాడా!

నిరక్షరాస్యత మంచిది కాదు నిజమే; కాని చేతికి దొరికిన ప్రతీదీ చదివి అదంతా నమ్మడం కంటె, చదువు రాకపోవడమే నయం.